పైడిపాలెం చేరిన కృష్ణా జలాలు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు చేరాయి. సోమవారం రాత్రి నుంచి కృష్ణా జలాలు గండికోట ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా పైడి పాలెం రిజర్వాయర్‌కు వచ్చి చేరుతు న్నాయి. పైడిపాలెం రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 6 టీఎంసీలు కాగా ప్రస్తు తం డ్యామ్‌లో 3 టీఎంసీల నీరు నిలవ ఉన్నాయి. రిజర్వాయర్ లో పూర్తి సామర్థ్యం నీటిని నింపేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిఇ శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం 500 క్యూసెక్కులు మాత్రమే నీటి పంపింగ్ జరుగుతుందని ఈ సామర్థ్యాన్ని మరింత పెంచుతామని తెలిపారు.

ఆగనున్న 'అమూల్' పాలవెల్లువ

నేటి నుంచి చక్రాయపేటలో నిలిపివేత
పాలసేకరణ వద్దని నోటీసులు
పాడి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అమూల్ నిర్ణయంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 21 నుంచి పాల సేకరణ నిలిపేస్తున్నట్లు సంస్థ నోటీసు జారీ చేసింది. దీంతో పాడి రైతులపై పెద్ద పిడుగు పడినట్లయింది. గత ప్రభుత్వ హయాంలో పాడి రైతులను ఆదుకునేందుకు అమూల్ ఆధ్వర్యంలో పాల సేకరణ చేపట్టారు. ప్రైవేట్ డెయిరీల కంటే అధికంగా పాల ధరలు పెంచి పాడి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని పాలకులు చెప్పిన హామీలు అనతి కాలంలోనే ఆవిరి కానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గుజరాత్ చెందిన అమూల్ డెయిరీ ఆధ్వర్యంలో జిల్లాలో పాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో పాల వెల్లువ తీసుకురావడానికి అప్పట్లో ఏపిడిడిఎ,

డిఆర్‌డిఎ, పశుసంవర్ధకశాఖల పర్యవేక్షణలో పాల సేకరణ చేపట్టారు. నియోజవర్గంలోని పులివెందుల, వేముల, వేంపల్లి, చక్రాయపేట, తొండూరు, సింహాద్రిపురం మండలాలతోపాటు పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లి మండలాల నుంచి ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఫెడరేషన్ (ఎపిడిడిసిఎఫ్), అమూల్ ఆధ్వర్యంలో సేకరణ ప్రారంభించారు. గేదె పాలకు సంబంధించి ఫ్యాట్ ఆధారంగా రూ. 45 నుంచి రూ.88, అదే ఆవు పాలు అయితే ఫ్యాట్ ఆధారంగా రూ. 31 నుంచి రూ.38తో గ్రామాలలో పాల సేకరణ చేస్తున్నారు.

నేటి నుంచి పాల సేకరణ వద్దని నోటీసులు..

ఈనెల 21 నుంచి చక్రాయపేట మండలంలో పాలసేకరణ వద్దని అమూల్ డెయిరీ సంస్థ నోటీసు ఇచ్చింది. ఇప్పటికే అనంతపురం, చిత్తూరు జిల్లాలో పాల సేకరణ వద్దని ఆదేశాలు జారీ చేసింది. నియోజవర్గంలోని చక్రాయపేట మండలంలో అత్యధికంగా పాడి పరిశ్రమ నెలకొంది. ప్రస్తుతం రోజూ ఐదువేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. అమూల్ సంస్థ పాల సేకరణ వద్దని నోటీసు ఇవ్వడం వల్ల పాడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాల సేకరణ కొనసాగించాలి..

అమూల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పాల సేకరణ కొనసాగించాలని పాడి రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రయివేట్ డెయిరీ లకంటే లీటరు అమూల్ ఆధ్వర్యంలో రూ. 5 నుంచి రూ.8 వరకు అధికంగా కొనుగోలుచేస్తున్నారు. పాల బిల్లుల చెల్లింపులు సైతం ప్రతి 10 రోజులకు ఓసారి పాడి రైతుల ఖాతాలకే జమ చేస్తున్నారు. అమూల్ ఆధ్వర్యంలో పాల సేకరణ కొనసాగించాలని పాడి రైతులు కోరుతున్నారు.

- కొండారెడ్డి, రామశేఖర, పాడిరైతులు,గురిజాల.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

డిఐఇపిసి ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందివ్వడంతో పాటు ఇండస్ట్రీస్ డెవెలప్మెంట్ పాలసీ (ఐడిపి) ప్రకారం ప్రభుత్వం అన్ని రకాల రాయితీలను అందిస్తుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రీయల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రొత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగే ందుకు ప్రోత్సహించడం జరుగుతోందని, పరిశ్రమల ప్రమోషన్ కు సంబందించి ఏవైనా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పరిశీలించి పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై విస్తృతంగా అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ నూతన పారిశ్రామిక వేత్తలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న రాయితీ మొత్తం విడుదల చేసేందుకు రాష్ట్ర స్థాయి కమిటీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు అనంతరం డిఐఈపిసి కమిటీ సభ్యులు, కో-ఆర్డినెటర్లు, ఇండస్ట్రీయల్ నిర్వాహకుల నుండి వివిధ సెక్టార్లవారీగా సంబంధిత అంశాలపై కలెక్టర్ అభిప్రాయాలను సేకరించి, వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో జెసి అదితి సింగ్, డిప్యూటీ చీఫ్/ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ కృష్ణ మూర్తి, ఇండస్ట్రీస్ జీఎం జయలక్ష్మి, లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జనార్దనం, అసోసియేట్ సభ్యులు రామమూర్తి నాయక్, సిక్కి కో -ఆర్డినేటర్ సి.బాబు, డిఐఎ కో- ఆర్డినేటర్ రమణ, ఎపిఐఐసీ ప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఫిషరీస్, పశుసంవర్ధక, హాండ్ లూమ్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్, లేబర్ శాఖల అధికారులు, జిల్లాలోని పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

- నగరంలో 5కె మారథాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కడప సంయుక్తంగా నిర్వహించిన యూత్ ఫెస్ట్ -2024లో భాగంగా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహనా కోసం యువతకు మంగళవారం 5 కె మారాథన్ రన్ పోటీలు డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు, జిల్లా లీగల్ సెల్ అథారిటీ జడ్జి బాబా ఫక్రుద్దీన్ ప్రారంభించారు. స్థానిక మహావీర్ సర్కిల్ , కొత్త కలెక్టరేట్ రోడ్డు నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు, యూటర్న్ తీసుకుని మహా వీరి సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ పరుగు పోటీల్లో ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలు, విశ్వ విద్యాలయలలో నుంచి 17 నుంచి 25 సంవత్సారాలు వయసు గల వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ రవి బాబు, జిల్లా ఇమ్మునిజేషణ్ అధికారి డాక్టర్. ఉమామహేశ్వర్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా క్రిడా శాఖాధికారి జగన్నాథ్ రెడ్డి, జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి మనికంఠ, జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ నాగరాజు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, క్రిడశాఖ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ, జిల్లా జడ్జి

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం విచారకరం

ప్రజాశక్తి- కడప అర్బన్

కోల్‌కొత్త ఆర్జీ కార్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్ మానభంగం, హత్య దిగ్భ్రాంతికరమని కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి, మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ అన్నారు. మంగళశారం సాయంత్రం డివిజన్ అధ్యక్షుడు అవధాన శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్యాండిల్ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం కలకత్తా హైకోర్టు ఆదేశం వల్లనే సిబిఐ రంగంలోకి ప్రవేశించిందని, సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేశాకే ఇప్పుడు కేసులో కొత్త కోణాలు బయటపడుతున్నాయన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం దోషుల్ని కాపాడుకునేందుకు తన రాజకీయ బలాన్ని అంతా ప్రయోగించడం, రాహుల్‌గాంధీ ఈ అంశంపై మాట్లాడడానికి ఆసక్తి చూపకపోవడం, బెంగాల్ ప్రభుత్వం తరపున ప్రఖ్యాత న్యాయవాది కపిల్ సిబాల్ రంగంలో ఉండడం బాధిత కుటుంబానికి న్యాయం జరగడంలో ఆటంకం అవుతోందని వాపోయారు. నిరసన ప్రదర్శనలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, సుధీకర్, వారిజాతమ్మ, వసుప్రద శ్రీవాణి, పద్మజాలత, శ్రీకృష్ణ, కెసిఎస్ రాజు, కుమార్, అప్పయ్య పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి కడప అర్బన్ : ప్రయివేట్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థినులు, మహిళల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని మహిళా ఎస్ఐలు పేర్కొన్నారు. మంగళవారం వారు ఎస్పి ఆదేశాల మేరకు కడప నగరంలో ఉన్న 13 కళాశాల విద్యార్థినుల ప్రయివేట్; వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో, ఉద్యోగం చేస్తున్న కార్యాలయంలో ఏమైనా సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. హాస్టళ్లను సందర్శించిన వారిలో మహిళా ఎస్.ఐలు, మహిళా పోలీసు సిబ్బంది జ్యోతి, లక్ష్మి, శాంతమ్మ, హైమావతి, నస్రీన్ ఉన్నారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : శాస్త్రీయత లేని ఫలితాలను నమ్మవద్దని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డేను విశ్వవిద్యాలయంలోని సేనేట్ హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ విజ్ఞాన సాంకేతికతతో దేశం పురోగమిస్తుంటే మరోవైపు మూఢనమ్మకాలు విశ్వసిస్తుండడం బాధా కరమన్నారు. ఆర్థిక స్వావలంబనతో శాస్త్రీయత సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ బాల్య దశ నుంచే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. నరేంద్ర ద బోల్కర్ గురించి అవగాహన కల్పించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సైన్సు మార్పును కోరుతుందని, ప్రగతిని ఆమోదిస్తుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ రిటైర్డ్ మేనేజర్ జి.గోపాల్ మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించుకోవడంతోపాటు ఎదురయ్యే ఆటంకాలను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. డాక్టర్ కల్పన మాట్లాడుతూ మూఢనమ్మకాలు పట్ల చైతన్యం కలిగిస్తూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు.

కెరీర్ కౌన్సెలింగ్‌తోనే సరైన మార్గం

ప్రజాశక్తి - కడప

కెరీర్ కౌన్సెలింగ్ అనేది సరైన మార్గాన్ని ఎంచుకోవడంలో ఉపయోగపడుతుందని కెరీర్ కౌన్సిలర్ గుణశేఖర్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో మంగళవారం భారత్ ఇంజినీరింగ్ కళాశాల, విష్ణు విద్యా మందిర్ లో "కరీర్ కౌన్సిలింగ్ - వ్యక్తిత్వ వికాసం' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ కెరీర్ కౌన్సిలింగ్‌లో ప్రొఫెషనల్ కౌన్సిలర్లు మార్గ నిర్దేశం చేస్తారని చెప్పారు. వారు జాగ్రత్తగా రూపొందించిన మూల్యాంకన సాధనాలను ఉపయోగించడంతోపాటు మనలో ఉన్న నైపుణ్యాలు మరియు లోపాలపై సలహాలను అందిస్తారని చెప్పారు. వ్యక్తి ఆసక్తులు, అర్హతలను జాగ్రత్తగా అధ్యయనం చేసిన తర్వాత, కెరీర్ కౌన్సిలర్లు వారి కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి మార్గనిర్దేశం చేశారని తెలిపారు. స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్ మాట్లాడుతూ తరచుగా విద్యార్థులు ఏ కోర్సులో చేరాలని అనేది సరిగ్గా అంచనా చేయలేకపోవడం గమనించవచ్చు అని తెలిపారు. తోటివారి ఒత్తిడి, ఎక్కువ మంది ఎంపిక చేసుకున్న కోర్సు విద్యార్థిని ఒక ఒక కోర్సును ఎంచుకోవడానికి దారితీస్తుంది అని అన్నారు. ఇరు కళాశాల చైర్మన్లు ఫరూక్ అహమ్మద్, శ్రీనివాసుల రెడ్డి మాట్లడుతూ ఈ కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమం వల్ల విద్యార్థులు ఎటువంటి కెరీర్‌ను ఎంచుకోవాలో అవగహన కలుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో ఇరు కళాశాలల విద్యార్థులు, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఫణి భూషణ్ రెడ్డి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, ఇన్స్ట్రక్టర్ యస్. అబ్బాస్ అల్లి, జూనియర్ అసిస్టెంట్ వి.వి. నారాయణ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో అవినీతిపై విచారించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు- నేడు పనుల్లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎఒ విజయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో నాడు- నేడు పనులు కోసం గత ప్రభుత్వం రూ.కోటి 15 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ గతంలో ఉన్న పాత భవనం మెటీరియల్ నూతన భవనం కోసం ఉపయోగించిపెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కళాశాల ప్రహరీ నాసిరకంగా కట్టారని అన్నారు. ప్రభుత్వ సొమ్మును కాజేసిన ప్రిన్సిప్‌ను విచారించాలని డిమాండ్ చేశారు. 75 సంవత్సరాల అతి పురాతన భవనం కూల్చి అందులోని విలువైన దులాలు వంటి వాటిని అమ్ముకున్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిపై విచారించాలన్నారు. కార్యక్రమంలో అజయ్ పాల్గొన్నారు.

సిఐ వెంకటేశ్వర్లకు సన్మానం

ప్రజాశక్తి - కడప

కడప తాలూకా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును మంగళవారం బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి మర్యాదపూర్వకంగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, కే. లక్ష్మమ్మయ్య పాల్గొన్నారు.

సొసైటీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప

తనకు అన్యాయం చేసిన పులివెందుల కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ పై చర్యలు తీసుకోవాలని కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సభ్యురాలు రోస్లిన్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రకాష్ నగర్‌లోని ఎపిపిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పులివెందులలోని కోపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ వారు వెంచర్ వేసి స్థలం ప్లాట్ ఇస్తామని చెప్పి తన దగ్గర డబ్బు తీసుకున్నారు అని తెలిపారు. తనకు ప్లాట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు అన్నారు. సీరియల్ ప్రకారం ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ విషయమై స్పందించి న్యాయం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో తిప్పిరిపాటి భానుమూర్తి, మల్లెం విజయభాస్కర్, జె. వై. ప్రసాద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే 'వయ్యారిభామ' నిర్మూలన

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : యాజమాన్య పద్ధతుల్లో వయ్యారిభామ నిర్మూలించొచ్చునని ఊటుకూరు కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. వయ్యారిభామ నివారణ వారోత్సవాల్లో భాగంగా కెవికె ఆధ్వ ర్యంలో ఈనెల 22 వరకు పలు కార్యక్రమాల నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా యాజ మాన్య పద్ధతుల్లో వయ్యారిభామ కలగజేసే నష్టాలను వివరిం చామన్నారు. వయ్యారి భామ మొక్కను కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, ముక్కుపుల్ల మొక్క తదితర పేర్లతో వాటిని పిలుస్తారని తెలియజేశారు, ఈ వయ్యారిభామ మొక్క భారతదేశంలోకి అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న గోధుమల ద్వారా ప్రవేశించి ఎక్కువ సమస్యగా మారిందన్నారు, మొక్క మనుషులకుచర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు కలగజేస్తుందన్నారు, ˘లుపు మొక్క పంటలలో 40 శాతం దిగుబడి తగ్గిస్తుందన్నారు. ఈ మొక్కలను గుర్తించి పూత రాకముందే పీకేసి కాల్చివేయాలన్నారు. జైగోగ్రామట్రైకోలరేట్ అనే పురుగులను వదిలి జీవ నియంత్రణ పద్ధతి ద్వారా కూడా నిర్మూలించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

సినీ కళామతల్లి ముద్దుబిడ్డ చిరంజీవి

ప్రజాశక్తి- కడప అర్బన్

పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల సందర్భంగా కడప జిల్లా చిరంజీవి యువత సభ్యులు ఉప్పు శ్రీకాంత్, రాజగోపాల్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీ దుర్గా సంస్థల అధినేత దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పంద్రా రంజిత్ కుమార్ సమక్షంలో పాత మార్కెట్‌లోని హమాలీలకు కొత్త బట్టలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ కళమ్మ తల్లి ముద్దుబిడ్డగా స్వయంకృషితో అనేక దశాబ్దాల పాటు తెలుగు సినీ ప్రేక్షకులను అలరించాలని తెలిపారు. తనని ప్రేమించే అభిమానులను సేవా మార్గాల వైపు నడిపిస్తూ అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మెగాస్టార్ అని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. తన రికార్డులను సైతం తానే తీరగా రాయగల నటుడు అన్నారు. చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని మార్కెట్లో నిత్యం శ్రమించే కార్మికులకు కొత్త బట్టలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గురు శేఖర్, నాంచారి రవికుమార్, నాగరాజ్, అతికారి నాగేంద్ర, శేషు రాయల్, లక్కీరాం, షేక్ హుస్సేన్, నవీన్, పసల బాలాజీ, మనోహర్, శివ పాల్గొన్నారు.

హమాలీలకు దుస్తులు అందజేస్తున్న దుర్గాప్రసాద్

మాట్లాడుతున్న జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డి

మండలాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-కాశినాయన

మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపిపి పోలమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మొదట ఎంపిడిఒ మైథిలీ అన్ని శాఖల అధికారులచే వారి వారి సమాచారాన్ని చదివి వినిపించమని ప్రకటించారు అనంతరం వైద్యాధికారి ప్రశాంతి మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడా అపరిశుభ్రంగా ఉండకుండా వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు డయేరియాతో ప్రజలు భయపడుతున్నారని ఎలాంటి భయపడాల్సిన అవసరం లేదని, గ్రామాల్లో జ్వరాలు, ఇతర వ్యాధులు ఉన్నాయని తెలిస్తే తమకు సమాచారం అందించాలని వాటిని నివారణకు వెంటనే చర్యలు చేపడతామన్నారు నరసాపురం ఆరోగ్య కేంద్రంలోని గర్భిణులకు కాన్పులు ఇక్కడే జరుగుతాయని గ్రామాలలో ఉన్న గర్భిణులను ఆరోగ్య కేంద్రానికి పంపే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ జెఇ బాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎవరికైనా ఇళ్లు మంజూరై కట్టుకోని పక్షంలో ఇప్పుడు నిర్మించుకోవచ్చని చెప్పారు. అనంతరం ఇతర శాఖల అధికారులు తమ సమాచారాన్ని చదివి విన్పించారు. సమావేశంలో గంగనపల్లి సర్పంచి ప్రభాకర్‌రెడ్డి మినహా ఏ ఒక్కరూ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆచారి, ఇఒపిఆర్‌డి ముజఫర్ రహీం, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 9 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు తప్పక వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పిడుగుపల్లి గ్రామంలో సుమారు 500 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులతో మాట్లాడుతూ గాలికుంటు పశువుకు 105 డిగ్రీల జ్వరం వస్తుందని తద్వారా నోటి నుంచి సొంగకార్చటం, నాలుక చిగుళ్ళకు పుండ్లు పుట్టడం, అలాగే గిట్టలకు గాయాలు ఏర్పడి కుంటుతూ పశువు తన ఉత్పాదకతను సామర్థ్యాన్ని కోల్పోతుందని పేర్కొన్నారు. చివరికి పశువు చనిపోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడూ పశువులకు టీకాలు వేయిస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల అనిమల్ హస్బెండరీలు, రైతులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, రాష్ట్ర పిలుపులో భాగంగా ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాసులు రెడ్డి, బి. మనోహర్, జిల్లా కోశాధికారి బి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వైద్యురాలి హత్య చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రాణాలు పోసే డాక్టర్ మీద దాడి చేయడం ఘోరమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చేయాలని పేర్కొన్నారు. తక్షణం హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారు.

వర్షం వస్తే ఆరోగ్య కేంద్రం జలమయం

నర్సాపురం పాఠశాలలోనూ ఇదే పరిస్థితి
ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

ఆరోగ్య కేంద్రంలో నిల్వ ఉన్న వర్షపునీరు

ప్రజాశక్తి-కాశినాయన

వర్షమొస్తే ఆరోగ్య కేంద్రం జలమయంగా మారుతుంది. మండల కేంద్రమైన నర్సాపురంలో ఎప్పుడు వర్షమొచ్చినా ఆరోగ్యకేంద్రానికి నీటి ముప్పు తప్పడం లేదు. ఈ సమయంలో ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మోకాళ్లలోతు వరకు నీరు నిల్వ ఉంటుంది. రోజూ వందల సంఖ్యలో రోగులు ఇక్కడి వస్తుంటారు. మండల కేంద్రంలో ప్రయివేట్ వైద్యశాలలు లేవు. ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఆర్ఎంపి వైద్యులున్నారు. మెరుగైన వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాల్సిందే. మండలంలోని సుమారు 20 గ్రామాలకు చెందిన పేదలకు ఆరోగ్య కేంద్రమే దిక్కు. మారుమూల ప్రాంతం నుంచి ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లాలంటే పేదలకు ఖర్చుతో కూడుకున్న పని. అంత వెచ్చించలేక గర్భిణుల నుంచి వృద్ధులు, చిన్నారులు మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. ఆస్పత్రిలో 24 గంటల వైద్య సదుపాయంతోపాటు మంచి ప్రావీణ్యం కల్గిన వైద్యులూ ఉన్నారు. ఆరోగ్య కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేశారు. స్టేషన్‌కు నిత్యం బాధితులు వస్తూ వెళ్తూంటారు. వర్షమొస్తే ప్రజల కష్టాలు వర్ణణాతీతం. అలాగే ప్రాథమిక పాఠశాల ఆవరణంలోనూ వర్షమొస్తే నీళ్లు అధికంగా ఉంటాయి. పాఠశాల లోపలికి విద్యార్థులు రావాలంటే కష్టంగా ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆరోజూ పంపరు. పాఠశాలలో కేవలం ఒకటి, రెండు తరగతులు నిర్వహించడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతారని పలువురు పేర్కొంటున్నారు. వారి కోసం ప్రభుత్వం సురక్షిత ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయడంతోపాటు ఆరోగ్యకేంద్రంలోనూ, స్టేషన్‌లోనూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ర్యాలీలో మున్సిపల్ చైర్మన్, ఎస్ఐ, మానవత సంస్థ ప్రతినిధులు

మంచి కార్యక్రమాలతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్ వద్ద నుంచి పూలంగళ్ళ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని, ఆ మేరకు నిర్వాహకులు ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివప్రకాష్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొండారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : సమాజంలో చక్కటి విలువలు కాపాడడంతోపాటు సమాజ సేవ చేయడమే మానవత లక్ష్యమని మానవత సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. వేంపల్లెలోని ఆయా పాఠశాలల విద్యార్థులు మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. శాంతి ర్యాలీని సిఐ సురేష్ రెడ్డి ప్రారంభించారు. నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో మానవత కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ రామాంజులరెడ్డి, మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఉషాకిరణ్ కరస్పాండెంట్ రమణారెడ్డి, రీజనల్ డైరెక్టర్ బాలాజీ, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగీశ్వర్ బాబు, కోశాధికారి శ్రీకళ, అరుణ్, శశి, గంగయ్య, డాక్టర్ రాజారాం, డాక్టర్ రంగయ్య, రామమునిరెడ్డి, అయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రతి ఒక్కరు సమ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంఇఒ చంద్రశేఖర్‌రావు సూచించారు. మంగళవారం ప్రపంచ శాంతి కోసం ర్యాలీ మానవత సేవా సంస్థ అధ్యక్షులు బి.టి.నరసింహారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మానవత సేవాసంస్థ గౌరవ సభ్యులు, సభ్యులు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వేణుగోపాల్, ఎంఇఒ చంద్రశేఖర్‌రావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. సభ్యులు రవీంద్రారెడ్డి, మస్తాన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పార్థసారథి, సంజీవ రాయుడు, నరసింహులు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, బాలాజీ, రాఘవేంద్ర, పద్మావతి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు : ఈ నెల 25న ప్రొద్దుటూరులో బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ అధ్యక్షులు బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 25న ఆదివారం ఉదయం 9.30గంటలకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆటస్థలంలో అండర్-14, 16 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-14 విభాగంలో 10 అక్టోబర్ 2010, 9 అక్టోబర్ 2012 మధ్య పుట్టిన వారు ట్రియాథ్లోన్(ఏ)60మీ, లాంగ్‌జంప్, హైజంప్, ట్రియాథ్లోన్(బి)60మీ, లాంగ్ జంప్, బ్యాక్‌త్రో, ట్రియాథ్లోన్(సి)60మీ, లాంగ్ జంప్, 600మీ, కిడ్స్ జావెలిన్.. అండర్-16 విభాగంలో 10అక్టోబర్ 2008, 9న అక్టోబర్ 2010 మధ్య పుట్టినవారు 60మీ, 600మీ, లాంగ్‌జంప్, హైజం ప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. కడప జిల్లా వారు అర్హు లన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరచిన వారిని సెప్టెంబర్ 14,15,16తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో నిర్వహించే స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపిక చేస్తారన్నారు. ఇందులో 12 ఏళ్లు నిండినవారు మాత్రమే పాల్గొనాలన్నారు. వయసు ధృవీకరణకు ఆధార్‌కార్డు/బర్త్‌సర్టిఫికేట్ సర్టిఫికెట్లు తమ వెంట తెచ్చి నిర్వాహ కులకు సమర్పించవలసి ఉంటుందన్నారు. విజేతలకు ప్రశంశాపత్రాలు అంద జేస్తారని వివరించారు. వివరాలకు 99496 86586కు ఫోన్ చేయాలని కోరారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వైసిపి నాయకులు మంగళవారం తహశీల్దార్ సరస్వతిని కోరారు. ఇటీవల ఆమె కొత్తగా ఖాజీపేట తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మురళిమోహన్ రెడ్డి, అగ్రహారం సహకారం సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, సర్పంచులు భూమన సుబ్బారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం కృష్ణారెడ్డి, నాయకులు నాగిరెడ్డి, అంబటి శివారెడ్డి, చిన్నరెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, సుధాకర్, కొమ్మలూరు ఓబుల్‌రెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, బుజ్జి పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ

దోమల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

దోమల నివారణపై డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, హెల్త్ డిక్టేటర్ వెంకటేశ్వర్లు, అధికారులు లక్ష్మయ్య, ప్రసాద్, సూపర్వైజర్ ఓబులేసు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చాపాడు : దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేసి, వాటి ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా మెదడు వాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధుల నుండి రక్షణ పొందాలని చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు శ్రీవాణి, పి.ఓబులేసు ప్రజలకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మహాదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, సూపర్వైజర్లు సరస్వతీ, బాబురెడ్డి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, ఫార్మసీ అధికారి సుభాషిణి, యుడిసి లోకేష్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతీ, ప్రజలు పాల్గొన్నారు.

మోటర్ వైర్లు చోరీ : రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలో నెల రోజులుగా ఆయా గ్రామాల పొలాల్లో ఏదోచోట మోటర్ల వైర్లు చోరీకి గురవుతున్నాయి. రామ్‌సాయి నగర్, చల్లబసాయపల్లె, మనేరాంపల్లె, గుడిపాడు, క్రీస్తు రాజపురం, హైవే రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతుల మోటర్ల వైర్లను దొంగలు కత్తిరించుకొని చోరీ చేస్తున్నారు. ఇలా వైర్ల చోరీకి పాల్పడుతున్న వారు ఇతర మండలాల వారని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ మోటర్ వద్ద వైరు కత్తిరించిన దొంగలు

ఆర్‌టిసి బస్టాండ్‌లో పార్కింగ్ సమస్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ సమస్య ప్రయాణికులను వేధిస్తోంది. నో పార్కింగ్ బోర్డు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికవాడగా ఎంతో అభివృద్ధి చెందింది. అయినా ఎర్రగుంట్లలో చాలా దయనీయమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఆర్‌టిసి బస్టాండ్ మాత్రం గత వైసిపి ప్రభుత్వంలో మరమ్మతులకు నోచుకొని హంగులతో రూపుదిద్దుకుంది. అయితే బస్టాండ్ విస్తీర్ణం తక్కువగా ఉండడం వల్ల ప్రయాణికులు వారి ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్ నలువైపులా ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్ డ్రైవర్లు, ప్రయాణికులు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా వేంపల్లె ప్రయాణికులకు ఒకవైపు ద్విచక్ర వాహనాలు మరోవైపు వర్షపు నీటితో నిండిన గుంతలు దర్శనమిస్తాయి. బస్సు ఎక్కాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. ఎఎన్ఎల్ పార్సిల్ సర్వీసుకు కూడా ఈ ద్విచక్రవాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. ఇప్పటికైన ఆర్‌టిసి యాజమాన్యం సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్ ఆవరణలో అడ్డదిడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాలు

సిబ్బందిని మందలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

లంచాలు అడిగే అధికారులు సెలవుపై వెళ్లండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

లంచాలు కావాలనుకునే అధికారులు సెలవుపై వెళ్లాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. ప్రొద్దుటూరు సబ్‌రిజిస్టర్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేసి, అక్కడి స్థితిగతులను పరిశీలించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఒకింత ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే.. ఇకపై లంచాలు పుచ్చుకోమని ఇటీవల ఇక్కడి అధికారితో దేవుడిపై ప్రమాణం చేయించినా తీరులో మార్పు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారితో డబ్బు వసూలు చేస్తూ, ఆ సొమ్మును రిజిస్టర్ ఆఫీస్ సిబ్బందికి వాటాలు పంచుతున్నారని ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్ శాఖ డిఐజికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దస్తగిరి, బాబు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు పారదర్శకంగా చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఖరీఫ్‌లో సాగు చేసిన అన్ని పంటలను పారదర్శకంగా నమోదు చేయాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని పెనికలపాడు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి పంట, ప్రతి సర్వే నెంబరును పరిశీలించి నమోదు చేయాలన్నారు. పంట నమోదు ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సర్వే చేసిన గ్రామాల్లో సాగు చేసిన పంట పొలాలు విస్తీర్ణంలో తేడాలు ఉంటే ఆయా గ్రామాల విఆర్ఒ, సర్వేయర్లను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కౌలు రైతులు పంట సాగు చేసే వారి పేరు మీద పంట నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం కొర్ర పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

వాగును పరిశీలిస్తున్న ఎఇ సోమశేఖర్‌రెడ్డి

సింహాద్రిపురంలో విస్తారంగా వర్షాలు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి విస్తారంగా వర్షం కురిసింది. మండలంలో 104.6 మిల్లీమీటర్లు వర్షం నమోదైంది. పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్ డ్యాములు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని కోరగుంటపల్లె-లోమడ మార్గంలోని వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలపల్లి సమీపంలో చీనీ తోటలో నీరు నిలిచింది. లోమడ సమీపంలో ఉన్న ఆర్అండ్‌బి వాగుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ శాఖ ఎఇ సోమశేఖర్‌రెడ్డి పరిశీలించి, రాకపోకలను నిలిపేశారు.

రాజీవ్ గాంధీ గొప్ప రాజనీతిజ్ఞుడు

ప్రజాశక్తి - వేంపల్లె

భారతరత్న, భారత మాజీ ప్రధాని, ఎఐసిసి మాజీ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో రాజీవ్ గాంధీ 80 వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా, ఎఐసిసి అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్థానిక ప్రభుత్వాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు కృషి చేశారన్నారు. 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన అసలైన గాంధేయ వాది రాజీవ్ అన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్, సమాచార విప్లవానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నేడు ప్రతి ఇంట్లో టివి, ప్రతి ఒక్కరి చేతిలో సెల్ ఫోన్ ఉన్నాయంటే కారకుడు రాజీవ్ గాంధినే అన్నారు. రాజీవ్ జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకం అని తులసిరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పులివెందుల ఇన్‌ఛార్జి ధృవకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాబు, సుబ్బరాయుడు, వేమా రాజా, వేమయ్య, వినయ్, వెంకటేశు, మాస్ రవి, మదార్ పాల్గొన్నారు.

కడప : ప్రధానిగా రాజీవ్ గాంధీ టెక్నాలజీ, కమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతంరెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ 8వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20న జన్మించారన్నారు. విమానయానంపై మక్కువతో పైలెట్‌గా ఉద్యోగం చేశారు. రాజకీయాలకు దూరంగా ఉండాలనుకున్న ఆయన 1980లో తన తమ్ముడు సంజయ్ గాంధీ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మరణించడంతో, రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు అని అన్నారు. 1984లో ఇందిరా గాంధీ మరణం తరువాత భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారన్నారు. రాజీవ్ గాంధీ యువనాయకుడిగా భారత దేశానికి ఎన్నో సేవలు అందించి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పఠాన్ మొహమ్మద్ అలీఖాన్, మామిళ్ల నరసింహులు, మామిళ్ల బాబు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వేంపల్లె : రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

నీరు నిల్వలేకుండా చూడాలని వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో వర్షపు నీరు నిల్వ కాకుండా చూడాలని జనసేన కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ మున్సిపల్ కమిషనర్ రామ కృష్ణయ్యను కోరారు. స్థానిక నాయకుల పిలుపుతో మంగళవారం ఆయన ప్రకాష్‌నగర్‌లో పర్య టించారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసన వెద జల్లుతోందని, దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని జగదీష్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

వర్షపునీటిని పరిశీలిస్తున్న జగదీష్

ప్రసూతి సెలవులు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరుపై కాంట్రాక్టు, గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటిలోని డైరెక్టర్లు కుమార స్వామి గుప్తాకు, భాస్కర్ పటేల్‌కు, ఉద్యోగులకు నజీర్ హుసేన్ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రిపుల్‌ఐటిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయడం సంతోషకరమని చెప్పారు. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఉద్యోగులు తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కూడా ప్రభుత్వానికి విన్నవించామన్నారు.

సిఐ ఆర్.మోహన్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సిఐకి టిడిపి నాయకుల ఘన సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆర్.మోహన్‌ను మంగళవారం టిడిపి మండలం సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, తుట్టే రాము యాదవ్, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, నారాయణ యాదవ్, సర్పంచ్ కొంగాని వెంకట సుబ్బయ్య యాదవ్, కూనవారిపల్లె సుబ్బిరెడ్డి సన్మానించారు. అలాగే సిఐ ఆర్.మోహన్‌ను టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మండలం పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొగ్గుల చంద్రబాబుల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చంద్రభాస్కర్ రెడ్డి, మామిళ్ల కృష్ణారెడ్డి, సుబ్బారాయుడు, హరినాథ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, డాక్టర్ ఆసిఫ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ సిబ్బందితో ఆయన మున్సిపల్ భవనంలో సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ సంస్థ ఆవరణలో, రహ దారులకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను విద్యార్థుల సహ కారంతో శుభ్రం చేశామన్నారు. పులివెందుల డివిజన్ పరిధిలో మందు బాబులు బహి రంగ ప్రదేశాల్లోనూ, ఫుట్‌పాత్‌లపై, ఖాళీ స్థలాల్లో మద్యం సేవించి సీసా లను, గ్లాసులను పగులగొడుతున్నారన్నారు. అలాంటి వారిపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

WANTED

APTRANSCO, OFC GANG TELECOM CIRCLE, KADAPA ZONE నందు ఔట్‌సోర్సింగ్ ప్రాతి పదికన పనిచేయుటకు Skilled Workers కావలెను.

Qualification : ITI, Age : 18-35 Years.

అనుభవం : 400KV/220 KV/132 KV Towers ఎక్కకలిగే సామర్థ్యం ఉండాలి.

క్యాటగిరిలు : OCPH(w)(VH)-1, SC-1, ST(W)-1, OC-1

14 రోజులలోపు మీ బయోడేటాను APTS Office, Kadapa నందు ఉంచిన Sealed Box లో వెయ్యగలరు.

వివరాలకు :
C.BOYAZU, Contractor, Kadapa.
Cell: 8333036050

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

మైదుకూరులో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - మైదుకూరు

కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనపై మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి రాయల్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. స్థానిక ప్రముఖ వ్యాపారవేత్త మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నిరసన తెలిపారు. నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు యుగంధర్, వైద్యులు అనిల్‌కుమార్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

- ట్రాఫిక్ సిఐ హాజీవలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆటో డ్రైవర్లు లైసెన్సు, యూనిఫామ్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఆటోకు ఇన్సూరెన్స్ ఆర్‌సి కలిగి ఉండాలని పట్టణ ట్రాఫిక్ సిఐ హాజీవలి సూచించారు. ఎస్‌పి ఆదేశాలతో పులివెందుల డిఎస్‌పి ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ సిఐ డి.హాజీవలి మంగళవారం పట్టణంలోని సిఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 600 ఆటోలకుగానూ 340కి పిఎస్ నెంబర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలినవారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నెంబర్లను పొందాలని సూచించారు. నిబంధనల మేరకు ఆటో నడపాలన్నారు. ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని హెచ్చరించారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ నాగ తులసి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైయస్ రాజారెడ్డి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో చదవాలన్నారు. విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులకు జూనియర్ కళాశాల విద్య ఓ మలుపురాయి లాంటిదని పేర్కొన్నారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

23న 'ఉపాధి' పనులపై గ్రామసభలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ నెల 23న ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో జయభారతి తెలిపారు. మంగళవారం ఏపీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో గ్రామసభలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలకు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలని ఆమె సూచించారు.

మంత్రిని కలిసిన గండిక్షేత్రం మాజీ చైర్మన్

ప్రజాశక్తి - చక్రాయపేట

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని మంగళవారం గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, పలువురు టిడిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా గండి క్షేత్రానికి రావాలని వారు కోరారు. గండి దేవస్థాన చైర్మన్‌గా వెంకటస్వామిని అధిష్టాన వర్గం, బీటెక్ రవి తీర్మానించారనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి పట్టం అశోక్‌కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, మాజీ ఆర్మీ ప్రసాద్, నాయకులు బాల వెంకటరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మంత్రికి బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

నేడు వేముల మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వేముల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి చల్లా గంగాదేవి వెంకటనారాయణ, ఎంపిడిఇ బీరం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య శాఖ ఎడి శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేవగుడి, సలివెందుల, గూడెంచెరువు గ్రామాల్లో మంగళవారం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయించడం వల్ల పాల ఉత్పత్తి తగ్గే శాతం శాశ్వతంగా నివారించవచ్చన్నారు. దూడల్లో మరణాలను తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సెప్టెంబర్ 18వ తేదీ వరకు ఈ కార్యక్రమం అన్ని గ్రామాల్లో చేపడు తున్నామని, పశువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు దస్తగిరమ్మ, జాన్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకా వేస్తున్న పశు వైద్య శాఖ ఎడి శ్రీధర్‌రెడ్డి

మహారాజశ్రీ పీలేరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No. 82 of 2023

పి.హరిత వేణి. ...పిటిషనర్

Vs

పి.నరసింహులు. ...రెస్పాండెంట్

రెస్పాండెంట్‌నకు నోటీసు

రెస్పాండెంట్:
పుల్లాసి నరసింహులు, S/o పి.నరసింహులు, డోర్ నెం.8-196, ఆజాద్‌నగర్, చింతకొమ్మదిన్నె, కడప మండలం & జిల్లా.

పై పిటిషనర్ దాఖలు చేసిన పై పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కేసును 06.09.2024వ తేదీన వాయిదా వేసిఉన్నారు. కావున మీరు నేరు కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 06.09.2024 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేనియడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

//By Order of Court//
కలకడ రామస్వామి రెడ్డి, B.Com., B.L.,
న్యాయవాది, పీలేరు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, PRODDATUR

E.P.No. 48/2023

O.S.No. 573/2019

Ummadishetty Lakshmi Narayana, S/o Late U.Ramadasu, aged 56 years, Hindu, Business, R/o D.No.9/196, Sreeramulapeta, Proddatur Town, Kadapa District. ...D.Hr./Petitioner

Vs

Bhaskara Venkata Anantharamu, S/o Late Seetha Ramaiah, Hindu, aged 51 years, Proprietor of Venkateswara Lodge, R/o.D.No.10/527, Sivalayam Street, Proddatur Town, Kadapa Dist. ...J.Dr./Respondent

నోటీసు

ఈ నెంబరు E.P.ని D.Hr, J.Dr పైన రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి E.P.లో J.Dr అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమేమనగా 25/09/2024వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉంటూవున్నది. కావున పై నెంబరు E.P. నందు ఉదయం 10.30 గం॥లకు మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గాని, మీ వకీలు ద్వారా గాని తెలుపుకొనవచ్చును. లేనంతట రాజశ్రీ కోర్టు నందు మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 25/09/2024

//By Order of the Court//
బి.సి.మాదయ్య
అడ్వకేట్, ప్రొద్దుటూరు.